క్లుప్తంగా

భూమనను కలిసిన జెడ్పీటీసీ వేమా



భూమన కరుణాకర్‌రెడ్డితో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకులు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మళ్లీ మంచి మెజార్టీతో గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భూమనతో చెప్పినట్లు వేమా శ్రీనివాసరావు తెలిపారు.

స్పందనకు 15 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 15 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 5 అర్జీలు, శానిటేషన్ విభాగానికి సంబంధించి 4, రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు వచ్చాయని కమిషనర్ వివరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. స్పందనకు సంబంధించి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా కమిషనర్ పాల్గొన్నారు. ఎంఈ కే మాల్యాద్రి, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తంగా అంబేడ్కర్‌కు గుర్తింపు

చీమకుర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు విశ్వవ్యాప్తంగా గుర్తింపు వస్తోందని అంబేడ్కర్ స్మృతివనం అధ్యక్షుడు నూకతోటి రామారావు అన్నారు. సోమవారం పేర్నమిట్ట స్మృతివనం ఆధ్వర్యంలో అంబేడ్కర్ ప్రశంస సభ నిర్వహించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక వీధికి అంబేడ్కర్ పేరు పెట్టటం, వియత్నాం నగరంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

లెప్రసీని గుర్తించి తగ్గించుకోవాలి

ఒంగోలు రూరల్ లెప్రసీని గుర్తించి తగ్గించుకోవాలని ఒంగోలు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి సూచించారు. లెప్రసీ మాసోత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్ధారణ, అనుమానిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రాగి రంగు స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే స్థానిక ఏఎన్‌ఎంను గానీ, పీహెచ్‌సీలోగానీ సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, హెచ్‌ఎస్‌లు మాధవి, అజిత, ఎస్ఎన్‌లు, జ్యోతి, భాను, విక్టోరియా పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రశాంతం

ఒంగోలు: ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఏపీ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం పదో తరగతి తెలుగు పరీక్షకు 359 మందికిగానూ 287 మంది హాజరయ్యారన్నారు. ఇంటర్‌లో తెలుగు పరీక్షకు 776 మందికి 681 మంది, హిందీ పరీక్షకు 19 మందికి 12 మంది, ఉర్దూ పరీక్షకు ఆరుగురికి ఐదుగురు హాజరయ్యారన్నారు. మొత్తం పదో తరగతికి 72 మంది, ఇంటర్ పరీక్షకు 103 మంది గైర్హాజరయ్యారని, పరీక్షలు పూర్తి కట్టుదిట్టంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

చర్చికి అని వెళ్లి ముగ్గురు అదృశ్యం

విజయవాడ సెంట్రల్: విజయవాడలోని అయోధ్యనగర్, శాంతినగర్ జీరో లైన్‌కు చెందిన కంతేటి కిరణ్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య కంతేటి స్వప్న (36), కుమారుడు కంతేటి రూపేశ్వర్ (15), కుమార్తె కంతేటి కుసుమ (11) ఉన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన వీరు రెండు నెలల క్రితమే అయోధ్యనగర్ వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు చర్చికి వెళ్లివస్తామని చెప్పిన స్వప్న.. తన ఇద్దరు పిల్లలతో వెళ్లింది. ఎంతసేపటికీ వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సింగ్‌నగర్ పోలీసులకు కిరణ్ కుమార్ సమాచారం ఇవ్వగా.. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న స్టెప్ సీఈవో బాబూరావు



మెడిసిన్ బాల్ విసురుతున్న చిన్నారులు



పరుగుపందెంలో పోటీపడుతున్న చిన్నారి

- స్టెప్ సీఈవో బాబూరావు
- స్పోర్ట్స్ స్కూల్‌కు ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఒంగోలు: కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను సోమవారం స్థానిక మినీ స్టేడియంలో ఉత్సాహంగా నిర్వహించారు. స్టెప్ సీఈవో బి.బాబూరావు ప్రారంభించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో క్రీడలతో పాటు విద్యకు అధిక ప్రాధాన్యత లభిస్తుందని, తద్వారా శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటూ విద్యార్థులు త్వరగా ఉన్నత స్థానంలోకి చేరేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. చిన్నతనం నుంచే క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా ఒలింపిక్స్ వంటి క్రీడాంశాల్లో కూడా పాల్గొని వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు దేశ కీర్తిని కూడా పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి చిన్నారి ఎంపిక కావాలనే పోరాటాన్ని ప్రదర్శించాలని సూచించారు. 4వ తరగతిలో ప్రవేశాలకు, 5వ తరగతిలో ప్రవేశాలకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి బ్యాటరీ టెస్టులతోపాటు ఎత్తు, బరువు, షటిల్, రన్నింగ్, మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. స్టెప్ చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికకు హాజరుకావాలన్నారు. ఎంపిక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, ఎం.నరేష్, కె.రోజర్ బిన్నీ, రాంబాబు, డీఎస్ఏ కోచ్‌లు వేణు, చిన్నారావు, బి.శ్రీనివాసులు, ట్రైనింగ్ పీఈటీలు కె.విష్ణుగణేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొని సహకారం అందించారు.

పీఎం కిసాన్ యోజనకు ఈకేవైసీ చేయించుకోవాలి

మద్దిపాడు: పీఎం కిసాన్ యోజన పథకం అమలు కావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రమేష్ సూచించారు. పీఎం కిసాన్ డబ్బు అందాలంటే ఈ నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మండలంలోని పెదకొత్తపల్లి, లింగంగుంట, నేలటూరు ఆర్‌బీకేలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులు సాగుచేసుకోవాల్సిన పంటల గురించి అవగాహన కల్పిస్తూ వారికి సహకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసరలు 50 శాతం సబ్సిడీపై అందిచండానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వీఏఏలను సంప్రదించి విత్తనాలు తీసుకోవాలని కోరారు. పచ్చిరొట్ట పంట సాగుచేయడం వలన భూసారం పెరుగుతుందని, తద్వారా తదుపరి పంటలకు దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి సమస్యలపై అర్జీ ఇస్తున్న ఆళ్ల రవీంద్రరెడ్డి

కొత్తపట్నం: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. అమరావతి సచివాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కాకాని గోవర్ధన్‌రెడ్డిని ఆళ్ల రవీంద్రరెడ్డి కలిసి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిహారం ఇవ్వమని ఆదేశించినప్పటికీ అధికారులు కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సబ్సిడీ విత్తనాలు, ఆర్‌బీకేల నిర్మాణం, ప్రకృతి వ్యవసాయం, పంట నిల్వల గోడౌన్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రిని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆళ్ల తెలిపారు.

జగనన్న సురక్షపై అవగాహన పెంచాలి



ఒంగోలులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



ఈదుమూడిలో సమావేశం నిర్వహిస్తున్న నాయకులు

- ఇంటింటికీ తిరిగి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి
- వార్డు సచివాలయ సిబ్బందితో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన పెంచాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పొనుగుపాటివారికాలనీలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం ఇంటింటికి తిరిగారు. జగనన్న సురక్ష పథకానికి సంబంధించిన విధివిధానాలను వివరించారు. సచివాలయాల సెక్రటరీలు అవలంబించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ప్రజలు పొందని పథకాలు ఏమైనా ఉంటే గుర్తించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ప్రజలకు ఏమైనా పత్రాలు, సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాల సమస్యలు ఉంటే గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. నూతన లబ్ధిదారులను గుర్తించడమే జగనన్న సురక్ష పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. నెల రోజుల పాటు కొనసాగుతున్న ఈ పథకం ద్వారా ప్రజలకు సంబంధించి నగర కమిషనర్‌తో పాటు మున్సిపాలిటీల కమిషనర్లు, మండల స్థాయి అధికారులు క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అలాంటి వారిని గుర్తించి సచివాలయాల వద్దకు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించి పథకం కోసం ఎంపిక చేయాలని సూచించారు. ఈ పథకాన్ని జూలై ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు సచివాలయాల స్థాయిలో క్యాంపులు నిర్వహించి అమలు చేసి అర్హులైన వారిని ఆగస్టు 1వ తేదీ ప్రకటించడం జరుగుతుందన్నారు. సర్టిఫికెట్ జారీకి సంబంధించిన సమస్యలేమైనా ఉంటే అలాంటి వాటిని నమోదు చేసుకోవాలని సూచించారు. జూలై 1వ తేదీ నుంచి సచివాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్న క్యాంపుల్లో వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం పొనుగుపాటికాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. మురుగు కాలువల్లో పూడిక తీయాలని, రోడ్ల పక్కన పిచ్చిచెట్లను కూడా తొలగించాలని సూచించారు. చెత్త సేకరణ వేగంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమం అందాలి...

నాగులుప్పలపాడు: నవరత్నాల అమలుతో పాటు జగనన్న సురక్ష పథకం ద్వారా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జరిగి వారికి సంక్షేమ పథకాల అమలే ధ్యేయంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కూనం పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం ఈదుమూడి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కుమ్మారి సుధాకర్, గ్రామ సర్పంచ్ బోలే లక్ష్మి, మట్టిగుంట సర్పంచ్ పాలేరు అనీలా నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీలతో చైర్‌పర్సన్ టెలీ కాన్ఫరెన్స్



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: జెడ్పీటీసీ సభ్యులతో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులకు ఫోన్‌చేసి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. మండలంలో పనులు, పెండింగ్ బిల్లులు, పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన పనులపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. వారికి జెడ్పీ కార్యాలయంలో ఏమైనా సమస్యలున్నాయా.. ఉంటే.. అవి ఏమిటనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. కాన్ఫరెన్స్ అనంతరం జెడ్పీటీసీల వద్ద నుంచి వచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో జాలిరెడ్డిని ఆదేశించారు. ఇతరత్రా సమస్యలుంటే పరిష్కరించేందుకు గల మార్గాలను అన్వేషించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో సరస్వతి

ఒంగోలు రూరల్: తల్లిదండ్రులంతా పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని ఎంఈవో–2 సరస్వతి సూచించారు. మండలంలోని మండువవారిపాలెంలో మండల ప్రైమరీ స్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సర్వం సమకూరుస్తోందని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎస్సీకాలనీ పాఠశాల ఉపాధ్యాయులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. తొలుత ముక్తినూతలపాడు జిల్లా హైస్కూల్‌ను ఎంఈవో సందర్శించారు. హెచ్‌ఎం దేవసేన, ఏఈ సందీప్‌కుమార్‌తో నాడు–నేడు పాఠశాల అభివృద్ధి పనులపై మాట్లాడారు. అనంతరం నగరంలోని కోటు వీధిలో నగరపాలక ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. రాఘవ బుక్ డిపోకు చెందిన నాదెండ్ల రాఘవ వాటిని సమకూర్చగా, ఎంఈవో పంపిణీ చేశారు. దాత రాఘవను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నత్తల ఝాన్సీరాణి, ఉపాధ్యాయుడు సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవలు విలువైనవి



రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: తెలుగు సాహిత్యానికి వంకాయలపాటి రామకృష్ణ చేసిన సేవలు ఎంతో విలువైనవని, ఆయన జీవితం సాహితీ జ్ఞాపకంగా చిరస్థాయిగా మిగిలిపోతుందని కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో సోమవారం వంకాయలపాటి రామకృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. పలువురు సాహితీవేత్తలు సభలో పాల్గొని ప్రసంగించారు. రామకృష్ణ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, రామకృష్ణ సతీమణి జయలక్ష్మి, కూతురు హిమబిందు, కుర్రా ప్రసాద్‌బాబు, పి.రాజ్యలక్ష్మి, కొడాలి శిరీష, వి.ఝాన్సి దుర్గ, బీరం అరుణ, మహతి బాలాజీ, మిడసల మల్లికార్జునరావు, బాలకోటయ్య, గుంటూరు సత్యనారాయణ, రాఘవులు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై నేడు ఓరియంటేషన్ కార్యక్రమం

ఒంగోలు: జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఏపీ మోడల్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని గతేడాది మాదిరే ఈ ఏడాది కూడా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఒంగోలు డివిజన్ పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మార్కాపురం డివిజన్‌లోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కాలేజీల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఓరియెంటేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. 10వ తరగతి అనంతరం, ఇంటర్ అనంతరం విద్యార్థులు ఎంపిక చేసుకోబోయే కెరీర్‌కు దోహదపడేలా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన అనంతరం పాఠశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆయా యాజమాన్యాలలోని ఎంపిక చేసిన ఉపాధ్యాయులను సంబంధిత ఉప విద్యాశాఖ అధికారి, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు రిలీవ్ చేసి ఓరియెంటేషన్ కార్యక్రమానికి పంపాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు ఎం.రవీంద్రప్రసాద్ (9666146850)ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 30న ధర్నా

ఒంగోలు టౌన్: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 30వ తేదీ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద, అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఒంగోలు సుందరయ్య భవన్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2020 విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వలన ప్రజలపై భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి పీవీ చౌదరి, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎమ్మెస్ సాయి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీహెచ్ సాగర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న గ్రో స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్

ఒంగోలు సబర్బన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గ్రో స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ కే రవికుమార్ సూచించారు. ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పీవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగించడం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకుండా తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డేవిడ్‌రాజు, సంస్థ ప్రోగ్రాం మేనేజర్ బాషా, సురేష్, ప్రసన్నకుమార్, అనిలా రాణి, విజయలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



లారీని క్రేన్‌తో తొలగిస్తున్న స్థానికులు

కంభం: ఇసుక లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. వివరాలు.. ఇసుక లోడు కంభం నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న లారీ స్థానిక వైజంక్షన్ వద్ద ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు క్రేన్ సాయంతో డివైడర్ పైకి ఎక్కిన లారీని తొలగించారు.

రైల్వే డబుల్ లైన్ పనులకు సహకరించాలి



కొండపోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న మహిళతో మాట్లాడుతున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: గుంటూరు–నంద్యాల మధ్య రైల్వే డబుల్ లైన్ పనులకు సహకరించి ఆక్రమణలో ఉన్న గృహాలను ఖాళీ చేయాలని తహసీల్దార్ కె.విజయకుమారి కోరారు. గిద్దలూరు రెవెన్యూ పరిధిలోని పాములపల్లె రైల్వే గేటు, రాచర్లరైల్వే గేటు మధ్య హిల్ 10 కొండ పోరంబోకు స్థలంలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న వారి వద్దకు సోమవారం తహసీల్దార్ వెళ్లి వారితో గృహాలను త్వరగా ఖాళీ చేయాలని కోరారు. గృహాలను ఖాళీ చేస్తే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని సూచించారు. హిల్ 10 కొండ పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న 22 గృహాల యజమానులు తక్షణమే వారి గృహాలను ఖాళీ చేస్తే తక్షణమే ఆ స్థలాన్ని రైల్వేశాఖ వారికి అప్పగించాల్సి ఉంటుందన్నారు.